క్లుప్తంగా

స్వీయ రక్షణతోనే అమ్మాయిలకు భద్రత



స్వీయ రక్షణపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీదేవి, కరాటే మాస్టర్ షేక్షావలి

కూడేరు: స్వీయ రక్షణతోనే అమ్మాయిలకు భద్రత, భరోసా ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బాలికలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వీయ రక్షణ నైపుణ్యం, భద్రత, మానసిక, ఆత్మ స్థైర్యంపై కళాజాతా బృందంతో అవగాహన కల్పించారు. అనంతరం సీడీపీఓ శ్రీదేవి మాట్లాడారు. 10 నుంచి18 ఏళ్ల వయసు బాలికల్లో నిర్దేశిత అంశాలపై మానసిక స్థైర్యం, ధైర్యం, దృఢ సంకల్పం పొంపొందించడమే లక్ష్యంతో జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శ్రీదేవి, సూపర్ వైజర్ రాజేశ్వరి, వార వాహి కళాజాతా బృందం ప్రతినిధి పురుషోత్తం, పీడీ అక్కులప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ 194వ జయంతి

ఉరవకొండ: ఉరవకొండలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెట్టమొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 194వ జయంతి సందర్భంగా స్థానిక హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం హ్యూమన్ రైట్స్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్లా టైలర్ లాలుసాబ్ మాట్లాడారు. చాబాల గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్, ఆర్ఎంఎం రాష్ట్ర అధ్యక్షులు అన్సార్ రహంతుల్లా, సభ్యులు రఫీక్, మైలారంపల్లి బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీఓ రమేష్, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి

కళ్యాణదుర్గం: వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఆర్టీఓ రమేష్, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి పిలుపునిచ్చారు. గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు, ఆర్టీఓ సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని రోడ్డు భద్రత నియమాలపై అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం మానవహారం నిర్వహించి, నినాదాలు చేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను వెహికల్ ఇన్స్పెక్టర్ లహరి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఆర్డీటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమన పద్య పఠన పోటీలు



పద్యపఠన పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: వేమన ఫౌండేషన్ అనంతపురం ఆధ్వర్యంలో ఈనెల 19న వేమన జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. గురువారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం చంద్రమౌళి మాట్లాడారు. ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, వెంకట్‌నారాయణ, బ్రహ్మచైతన్య, విజయలక్ష్మి, సాయిగీత, అర్చన, గోపాల్‌నాయక్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, పీఈటీ ఇ బ్రహీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఆకస్మిక తనిఖీ



పాఠ్య పుస్తకాలను తనిఖీ చేస్తున్న డాక్టర్ నాగలింగారెడ్డి

కళ్యాణదుర్గం: ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కడప ఫోర్త్ జోన్ కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ నాగలింగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో తరగతి గదులను ల్యాబ్‌లను, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల హాజరును పెంచాలని సూచించారు. రాబోవు విద్యా సంవత్సరంలో హాజరు శాతాన్ని పెంచాలన్నారు. అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, పౌర సంబంధాల అధికారి డాక్టర్ కె.శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరుకే మినరల్.. తాగేదంతా గరళం



- కలుషితమవుతున్న శుద్ధజలాలు
- పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు
- మచ్చుకైనా కనిపించని ఐఎస్ఐ ధ్రువీకరణ ప్లాంట్లు
- రుచికోసం కెమికల్స్ కలుపుతున్న నిర్వాహకులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు

కుందుర్పి: ఒకప్పుడు బావులు, బోరు బావుల్లో నీరు తాగి జనం ఆరోగ్యంగా ఉండేవారు.. ఇప్పుడు అందరూ 'మినరల్' పేరిట గరళం తాగుతున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా అందరూ శుద్ధి జలం అంటూ కలుషిత నీరు తాగునీరు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు. రుచి కోసం కెమెకిల్స్ కలుపుతూ నాణ్యతకు బదులు.. నాసిరకం నీరు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

నియోజక, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ మినిరల్ వాటర్ ప్లాంట్ల పేరుతో పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలో 53, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 41, ఉరవకొండ నియోజకవర్గంలో 46 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పేరుకే మినరల్ వాటర్ ప్లాంట్ .. కానీ నీటి నాణ్యతలో ప్రమాణాలు పాటించడం లేదు. ఒక చిన్న గది, ఒక కుళాయి ఉంటే చాలు.. అధికారుల కాళ్లావేళ్లా పడి అనుమతి తెచ్చుకొని వాటర్ ప్లాంట్ అని పేరు పెట్టి నిర్వహిస్తున్నారు. నీటిని ప్లాస్టిక్ క్యాన్లలో నింపి, గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రతి ఇంటికీ తాగడం అలవాటు చేశారు. ఈ నీరు తాగడం వల్ల జుట్టు రాలడం, అతిసారం, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు, ఎముకల సంబంధిత రోగాలు వస్తున్నాయి. అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా శుద్ధజలం అంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా ధరలు..

కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు 20 లీటర్ల క్యాన్ తోచిన విధంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ప్లాంట్ల దగ్గర ఒక రేటు అదే డోర్ డెలివరీ అయితే మరో ధరతో విక్రయిస్తున్నారు. ఒక్క క్యాన్ రూ.10 నుంచి రూ.20 వరకు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు.

ప్లాంట్లను తనిఖీలు చేపట్టని అధికారులు

వాటర్ ప్లాంట్ల నిర్వహణపై తరచూ అధికారులు తనిఖీలు చేపట్టాలి. గ్రామ పంచాయతీ అధికారులు, డాక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్లాంట్ల వద్దకు వెళ్లి నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలి. కానీ అధికారులు ఎక్కడా పర్యవేక్షించిన దాఖలాలు కనిపించలేదు. అంతర్జాతీయ ప్రమాణాలు పాటించి ప్లాంట్లు నిర్వహించాలంటే రూ.లక్షలు వెచ్చించాల్సి ఉంది. దీంతో గ్రామాల్లో రూ.లక్షలులోపు వెచ్చించి చౌకగా లభించే ప్యూరిఫైడ్ మిషనరీ ద్వారా నీటిని శుద్ధిచేసి విక్రయిస్తున్నారు. సోడియం, కార్బొనేట్, సోడియం క్లోరైడ్ శాక్రీన్ కలిపి నీటిని తియ్య బరుస్తున్నారు.

నిబంధనలు ఇలా ...

- నీటిని నిల్వ ఉంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకునే వాడాలి.
- అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రివర్స్ ఆస్మాసిస్ ప్రక్రియ ద్వారా నీటిని శుభ్రపరచాలి.
- ప్లాంట్ నిర్మాణానికి 2,200 చదరపు మీటర్ల స్థలం కేటాయించాలి. నిబంధనలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.
- శుద్ధి చేసిన నీరు నిపుణుల ద్వారా పరీక్షించిన తర్వాత విక్రయించాలి.
- రేడియో యాక్టివిటీ టెస్టు, ప్యాకింగ్ మెటీరియల్ టెస్టు, కంప్లీట్ అనాలసిస్ ఇన్‌క్లూడింగ్ పెస్టిసైజ్ టెస్టులతో అనంతరం అన్నీ సావ్యంగా ఉంటే ఫైనల్‌గా ఇండియన్ స్టాండర్డ్ కంపెనీ ఐఎస్ఐ ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేస్తుంది.

కలుషిత నీరు విక్రయిస్తున్నారు



గ్రామాల్లో పోటాపోటీగా శుద్ధజల ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. తీపికోసం నీళ్లలో ఏవేవో కెమికల్స్ వేసి విక్రయిస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీలోనే వాటర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. నీరు తీపిగా ఉండడంతో ప్రతి ఒక్కరూ ఈనీటిని ఇష్టపడుతున్నారు. అధికారులు కనీసం నెలకు ఒకసారైనా ప్లాంట్లు పరిశీలించాలి.

– తిప్పేస్వామి వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు, కళ్యాణదుర్గం డివిజన్

తనిఖీలు నిర్వహిస్తున్నాం



గ్రామాల్లో ఏర్పాటైన మినిరల్ వాటర్ ప్లాంట్లను తమతో పాటు వైద్యాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నాం. తప్పని సరిగా నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని ప్లాంట్లను కొన్ని చోట్ల మూయించాం. ప్లాంట్ల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని పదేపదే చెబుతున్నాం.

– రామాంజనేయులు, ఈఓఆర్‌డీ

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



మున్సిపాల్ కమిషనర్ పనితీరుపై మండి పడుతున్న చైర్మన్ రాజ్‌కుమార్

కళ్యాణదుర్గం రూరల్: అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ రాజ్ కుమార్, వైస్ చైర్మన్ ఫణి, పట్టణ కన్వీనర్ శ్రీనివాసలు కమిషనర్ వంశీకృష్ణను కోరారు. గురువారం పట్టణంలోని మున్సిపాల్ కార్యాలయంలో మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్ కమిషన్ వంశీకృష్ణ, కౌన్సిలర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ పని తీరుపై చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు సుధీర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి అభివృద్ధి ఆగిపోయిందన్నారు. మున్సిపాలటీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొందన్నారు. మురుగునీరు ఎక్కడ చూసినా రోడ్డుపైన ప్రవహిస్తోందన్నారు. మూడు నెలలుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా టీడీపీ నాయకులు అడ్డుకుంటుంటే, అందుకు కమిషనర్ వత్తాసు పలుతున్నారని మండిపడ్డారు. కౌన్సిల్ సమావేశం జరగకూడదనే కుట్రతో అధికార పార్టీ నాయకులు అనవసరంగా గొడవలు పెడుతున్నారని, టీడీపీ చేస్తున్న కుట్రకుతంత్రాలను ప్రజలు చూసి టీడీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారన్నారు. పదిరోజుల్లోపు కౌన్సిల్ మీట్ నిర్వహించాల్సిందేనని కమిషనర్‌కు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వార్డుల్లో ఎక్కువ శాతం చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోయిందని కమిషనర్‌ను ప్రశ్నించినందుకు బిక్కి హరి కమిషనర్‌పైనే దాడిచేయడానికి వచ్చాడని పోలీస్ కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది కక్ష సాధింపు కోసం కాదన్నారు. కార్యక్రమలో కోఆప్షన్ మెంబర్ అబ్జల్, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డ్రమ్ములు, టార్పాలిన్ల కోసం ఎదురుచూపు



కూడేరు: కొర్రకోడు రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉంచిన డ్రమ్ములు (ఫైల్)

కూడేరు: మండలంలోని దళిత రైతులు డ్రమ్ములు, టార్పాలిన్ల కోసం ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట వేసింది. మండలంలో ముద్దలాపురం, కొర్రకోడు, కడదరకుంట, కరుట్లపల్లి, జల్లిపల్లి, పి.నారాయణపురం, ఎంఎంహళ్లి, జయపురం, చోళసముద్రం, ఉదిరిపికొండ, హంసాయపల్లి, శివరాంపేట, మరుట్ల గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల ముందు ఆయా గ్రామాల్లోని 97 మందికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 100 లీటర్ల డ్రమ్ములు 97, రెండొందల లీటర్ల డ్రమ్ములు 97, టార్పాలిన్లు 97 విడతల వారీగా సరఫరా అయ్యాయి. వీటిని పంపిణీ చేద్దామని కొర్రకోడు రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ భద్రపరిచారు. అంతలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటి పంపిణీ నిలిచిపోయింది. వాటిని ఇప్పటికీ పంపిణీ చేయకుండా నిలిపివేశారు. కాగా కొర్రకోడులోని ఓ వర్గం టీడీపీ నాయకులు ఇటీవల ఆర్‌బీకే గది తాళాలు ధ్వంసం చేసి, అందులోని కొన్ని డ్రమ్ములు, టార్పాలిన్లు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. డ్రమ్ములు, టార్పాలిన్ల కోసం 97 మంది ఎస్సీ రైతులు ఎదురు చూస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కళ్యాణదుర్గం: విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శివ ప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దన్న, ఎన్నికల అధికారి ప్రభాకర్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా ఎం.తిప్పేస్వామి, కోశాధికారిగా ఎ.అంపన్న, గౌరవాధ్యక్షులుగా కిష్టయ్య చౌదరి, అసోసియేట్ అధ్యక్షులుగా పాతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా పాండు రంగ, రాజన్న, ప్రసాద్, పాలనాయక్, నరసింహస్వామి, పరిపూర్ణవతి, సంయుక్త కార్యదర్శులుగా అంజినప్ప, ఫక్రుద్దీన్, భగవాన్ దాస్, సత్యేంద్రనాథ్, కృష్ణరాజు, కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



వివేకానంద హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో కరస్పాండెంట్, యాజమాన్యం



సాంప్రదాయ దుస్తుల్లో భోగి మంటలు వేసిన విద్యార్థులు

కళ్యాణదుర్గం: పట్టణంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఉల్లాసంగా నిర్వహించారు. కరస్పాండెంట్ సునీత సంగప్ప, అకాడమీ డైరెక్టర్ నరసింహాచారి, ఏఓ తిప్పేస్వామి, ప్రధానోపాధ్యాయులు వన్నూరు స్వామి, ఖాసీంలు సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో నిర్వహించే కార్యక్రమాలను ముందుగానే పాఠశాల ఆవరణలో నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి, సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతిగా సుగుణమ్మకు రూ.9 వేలు, రెండో బహుమతిగా రాధిక, చిట్టెమ్మలకు రూ.6 వేలు, మూడో బహుమతిగా సునీతా సంగప్పకు రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంప్రదాయాలు తెలియజేసే సంక్రాంతి పండుగ

బెళుగుప్ప: ఆచార సాంప్రదాయాలను పెద్దల నుంచి పిల్లలకు తెలియజేసే పండుగే సంక్రాంతి అని తహసీల్దార్ షర్మిళ, వైద్యులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్ఎం సుమ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ చేతులమీదుగా బహుమతులు అందించారు.

అశోక్ లేల్యాండ్ వాహనం బోల్తా

బొమ్మనహాళ్: మండలంలోని గొనూరు రోడ్డులో గురువారం అశోక్ లేల్యాండ్ వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన మేరకు.. మండలంలోని శ్రీధరఘట్టకు చెందిన అనిల్‌కుమార్, వినోద్ ఇద్దరూ అశోక్ లేల్యాండ్ వాహనాలతో గొనూరు వైపు నుంచి వెనుక ముందు పోటాపోటీగా వచ్చారు. దీంతో అనిల్‌కుమార్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ అనిల్‌కుమార్ ప్రమాదం సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు బోల్తా పడిన వాహనాన్ని బయటకు తీశారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

వజ్రకరూరు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. గురువారం మండలంలోని వెంకటాంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వందరోజుల స్టడీ అవర్స్‌ను ఎంఈఓ తిమ్మప్ప పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు భయాన్ని వీడి ప్రణాళికా బద్ధంగా చదవాలని, స్వేచ్ఛగా పరీక్షలు రాసి, మంచి ఫలితాలు సాధించాలని

సంక్షిప్త సమాచారం

సూచించారు. హెచ్ఎం రంగనాథ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆంధ్ర,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు.

'ముక్కోటి'కి ఆలయాల ముస్తాబు

- నేడు వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు పూర్తి



వెంకటేశ్వర ఆలయం



శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడు

రాయదుర్గం: ముక్కోటి ఏకాదశికి నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన వైష్ణవాలయాలన్నీ ముస్తాబయ్యాయి. పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణ ఆలయాన్ని, గాలి గోపురాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు బారులు దీరనున్నారు. అందుకు తగ్గట్టుగా దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ అనంతరం తెల్లవారుజామున 4 గంటలకే లక్ష్మీతులసి దళాల అర్చన, సహస్రనామం, మహా మంగళహారతితో తొలిపూజ నిర్వహిస్తారు. అనంతరం స్వామి ఉత్సవాన్ని లక్ష్మీబజారు వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందని దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలను ఆలయ ప్రాంగణంలోనే నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీబజార్‌లో లక్ష్మీనారాయణ ఆలయం, బొమ్మనహాళ్ మండలం వెంకటేశ్వరస్వామి, పాండు రంగస్వామి, కణేకల్లు మండలంలో నరసింహస్వామి ఆలయాల్లోనూ ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. ఉచిత అన్న ప్రసాదాలు పెట్టనున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలో వెలసిన తిమ్మప్ప (వెంకటేశ్వర) స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. వేకువజామున స్వామికి పూజలనంతరం 7 గంటల నుంచి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10న ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. గురువారం వజ్రకరూరులోని జనార్దన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఆలయ ఈఓ పరిశీలించారు.

బెళుగుప్ప: మండలంలోని వైష్ణవ ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. శ్రీరంగాపురంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. బూదిగుమ్మలో పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో, వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లు చేశారు.

బాల్యవివాహాల కట్టడికి సమష్టిగా కృషి చేయాలి

- ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి



పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి

ఉరవకొండ: బాల్య వివాహాల కట్టడికి, మూఢనమ్మకాలపై సమష్టిగా కృషి చేయాలని, గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచే విధంగా విద్యార్థులు, యువత కృషి చేయాలని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి సూచించారు. గురువారం మండల పరిధిలోని చిన్నముస్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గతేడాది డిసెంబర్ 20న లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్యవివాహాలు, డ్రగ్స్ వాడకం, హ్యూమన్ ట్రాఫికింగ్ పైన విద్యార్థులకు వ్యాసరచన, షార్ట్ ఫిలిం, ఇన్‌స్టాగాం లాంటి సామాజిక మాధ్యమాల పోటీల్లో విజేతలకు న్యాయమూర్తి చేతుల మీదుగా బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆశ్రాఫ్‌అలీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌తో ప్రయోజనం



కర్తనపర్తి గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

కంబదూరు: రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌తో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, భూములకు సర్వ హక్కులు వస్తాయని ఆర్డీఓ వసంతబాబు అన్నారు. మండలంలోని కర్తనపర్తిలో రెవెన్యూ అధికారులు గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రీసర్వే ద్వారా భూముల సరిహద్దులు కచ్చితంగా గుర్తించబడుతాయన్నారు. భూ రికార్డులు పారదర్శకంగా రూపొందించడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకిషన్, రీ సర్వే డీటీ గణేష్ పాల్గొన్నారు.

వజ్రకరూరు: రీసర్వేతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ తెలిపారు. గురువారం మండలంలోని గూళ్యపాళ్యం గ్రామంలో సర్పంచు కురుబలక్ష్మయ్య అధ్యక్షతన రీసర్వేపై పైలెట్ ప్రాజెక్టు– రీసర్వే గ్రామసభ (అవగాహన సదస్సు) ఏర్పాటు చేశారు. తహసిల్దార్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి క్షేత్ర స్థాయిలో రీసర్వే ప్రారంభం కానున్నట్లు తెలిపారు. స్థానిక సర్పంచు కురుబ లక్ష్మయ్య, రీసర్వే డీటీ కేశవరెడ్డి, మండల సర్వేయర్ మంజుల, వీఆర్వో సుధాకర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన భాగవత సప్తాహ కార్యక్రమం



దత్తామునీంద్రస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: నక్కలపల్లిలో శుక్రవారం భాగవత సప్తాహ కార్యక్రమం గ్రామస్తుల ఆధ్వర్యంలో స్థానిక సీతారామంజనేయస్వామి ఆలయంలో ప్రారంభించారు. ఏడు రోజులపాటు భాగవత సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తొలుత ప్రథమ స్కందం, అశ్వత్థామ పరీక్షన్మహారాజ ఘట్టం పద్యాలను శ్రీనివాస విద్యానికేతన్ కణేకల్ క్రాస్ విద్యార్థులు పఠించారు. అనంతపురానికి చెందిన దత్తామునీంద్రస్వామి, పాపంపల్లికి చెందిన నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రప్పను నిర్వాహకులు సన్మానించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



కళ్యాణదుర్గం: ఆర్‌జేడీసీఈ, జీసీటీఏ 2025 నూతన క్యాలెండర్‌ను ఫోర్త్ జోన్ ఆర్‌జేడీసీఈ డాక్టర్ నాగలింగారెడ్డి, ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి ఆవిష్కరించారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆర్‌జేడీసీఈ, జీసీటీఏ క్యాలెండర్‌ను విడుదల చేశారు. జీసీటీఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోనంకి శ్రీధర్ మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు చాముండేశ్వరి దేవి, మౌనిక సాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శేషయ్య, అధ్యాపకులు శ్యాం ప్రసాద్, శైలజ రాణి, జోత్స్న, ప్రభావతి, కవిత పాల్గొన్నారు.